క్లుప్తంగా

నగరంలో వైద్యశిబిరం

నిజాంపేట(మెదక్): మండలంలోని నగరం గ్రామంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు రోగులను పరీక్షించి వైద్య సేవలు అందజేశారు. శిబిరంలో పెద్ద సంఖ్యలో రోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మోహమ్మద్ ఆరీఫ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ పిలుపు

నర్సాపూర్: ఈనెల 14వ తేదీ నుంచి విద్యుత్ శాఖలో ఆర్టిజన్లు చేపడుతున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ జిల్లా చైర్మన్ స్వామి, కో చైర్మన్ నాగరాజు కోరారు. మంగళవారం నిరవధిక సమ్మె వాల్‌పోస్టరు వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జేఏసీ పిలుపు మేరకు తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మెకు వెళుతున్నట్లు తెలిపారు. ఆర్టిజన్ కార్మికులందరు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా జేఏసీ చైర్మన్ రాములునాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులపై అవగాహన అవసరం : టీజీబీ మేనేజర్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీజీబీ మేనేజర్ రాజేశ్

రేగోడ్(మెదక్): బ్యాంకు సేవల పట్ల అవగాహన కలిగి ఉండాలని స్థానిక టీజీబీ మేనేజర్ రాజేశ్ విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రమైన రేగోడ్‌లోని మోడల్ స్కూల్ విద్యార్థులు మంగళవారం టీజీబీ బ్యాంకుకు వెళ్లి.. అధికారులు అందిస్తున్న సేవలు, బ్యాంకు కార్యకలాపాలపై పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ.. బ్యాంకులో జమ, విత్‌డ్రాలు ఎలా చేయాలి, తమ బ్యాంకు ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్లు రాజ్‌కుమార్, భూమయ్య, క్యాషియర్‌లు రాకేశ్, ఉదయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



సమావేశంలో మాట్లాడుతున్న సీఎంఓ రాజు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి రాజు అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని బాలికల ఉన్నత పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తోందన్నారు. ఉచిత విద్య, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తోందని, తల్లిదండ్రులు తప్పకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశం, హెచ్‌ఎంలు సత్యకుమార్, మారుతి తదితరులున్నారు.

పత్తి కలుపులో జాగ్రత్తలు తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ కృష్ణ

పెద్దశంకరంపేట(మెదక్): పత్తిపంట కలుపులో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని మండల ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి కృష్ణ అన్నారు. మంగళవారం మాడ్చెట్‌పల్లి శివారులో పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కలుపు నివారణ, తెగుళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు.

పామాయిల్‌తో అధిక లాభాలు

మనోహరాబాద్(తూప్రాన్): పామాయిల్ పంటలతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండల కేంద్రంలో రైతువేదికలో రైతుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు నాణ్యతతో కూడిన విత్తనాలను వాడాలని, అవసరమైన మేరకే రసాయనాలను వాడాలని సూచించారు. అనంతరం రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ యాదగిరి, ఏఈఓ నరేందర్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

వికాసమా! విలాపమా!

- ఎన్నికలొస్తున్నాయి..ఏం చేస్తారో..?
- ఆందోళనలో రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులు



మెదక్ కలెక్టరేట్: ఉద్యోగం, ఉపాధి లేక అనేక ఇబ్బందులు పడుతున్న జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. దీంతో ఎన్నో ఆశలతో వేలాదిమంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులు, ధ్రువ పత్రాల పరిశీలన పూర్తి కాగా..తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న రుణాలు మంజూరు పత్రాలను అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే చివరి క్షణంలో రుణాలను మంజూరును వాయిదా వేసింది. దరఖాస్తులు స్వీకరించిన నెలరోజులు గడిచి పోయినా ఇంకా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలంటున్నారు. దీంతో రుణాలిస్తారా? లేదా? అని లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా రుణాలిచ్చి స్వయం ఉపాధికి మార్గం చూపాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఎన్నో ఆశలతో..

ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించి 18 నుంచి 55 యేళ్లలోపు నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటన చేసింది. దీంతో జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు భారీఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. అర్హత ఆధారంగా రూ.50 నుంచి 4లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది.

రూ.50వేల వరకు పూర్తి సబ్సిడీ

రూ.50వేల వరకు రుణం తీసుకునే నిరుద్యోగులకు పూర్తిస్థాయిలో సబ్సిడీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆపై రుణాలకు బ్యాంకు లింకేజీల ద్వారా ఇస్తూ యూనిట్ విలువ ఆధారంగా సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు స్వయం ఉపాధి పొందడానికి ప్రభుత్వం 81 యూనిట్లు పెట్టుకునేందుకు అవకాశం కల్పించింది.

జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, ఓబీసీలు కలిపి మొత్తం 32,638 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో ఎస్సీలు 6,711, ఎస్టీలు 3,461, బీసీలు 19,686, ఈబీసీలు 550, మైనార్టీలు 2,175 క్రిస్టియన్లు 55 ఉన్నారు. ఈ దరఖాస్తలను పూర్తిస్థాయిలో పరిశీలన చేసిన అధికారులకు బ్యాంకులకు 29,855 దరఖాస్తులను బ్యాంకులకు పంపించారు. సరైన ధ్రువ పత్రాలు లేని కారణంగా మిగతా వాటిని తొలగించినట్లు సమాచారం. ముందుగా రూ.50వేల వరకు రుణాలు ఇస్తామని తెలిపి తేదీని ప్రకటించిన ప్రభుత్వం వాయిదా వేయడంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అనంతరం రాజీవ్ యువ వికాసంపై అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల తేదీ వచ్చేలోగా రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జిల్లాకు 10.687 యూనిట్లు

జిల్లాకు రాజీవ్ యువ వికాసం పథకం కింద మొత్తం యూనిట్లు 10,687, ఇందులో లింకేజీ లేకుండా 3,498 యూనిట్లు, లక్షలోపు రుణాలు 2,632 యూనిట్లు, రూ. 2లక్షల వరకు 2,261 యూనిట్లు, రూ.4 లక్షల వరకు 2,205 యూనిట్లు, మైనర్ ఇరిగేషన్‌కు అదనంగా మరో 51 యూనిట్లు, మొత్తం దరఖాస్తులు : 32,638

ఎన్నికలొస్తున్నాయి..



ఇంటర్ పూర్తిచేశాను. స్వయం ఉపాధి పొందుదామని రాజీవ్ యువ వికాసం కింద డెయిరీకి దరఖాస్తు చేసుకున్నాను. రుణం ఇస్తే స్వయం ఉపాధి పొందవచ్చునని ఆశపడ్డాను. కాని రుణాల పంపిణీ వాయిదా వేశారు. నెలరోజులు గడిచి పోతున్నా...రుణాల గురించి ఎలాంటి సమాచారం లేదు. ఎన్నికలంటున్నారు. కోడ్ వచ్చేలోగా ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలి. — బాల్‌రాజ్, రంగంపేట

వ్యవసాయానికి ఉపయోగంగా..



వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుందని బోరు, మోటర్‌కోసం దరఖాస్తు చేసుకున్నాను. వర్షాకాలం సీజన్ ప్రారంభమైంది. కానీ, ఇప్పటి వరకు రుణాలు మంజూరు కాలేదు. ప్రభుత్వం త్వరితగతిన స్పందించి రుణాలు మంజూరు చేయాలి. — గజ్జెల కుమార్, మద్దుల్వాయి.

ఉత్తర్వులు రాగానే మంజూరు

ధ్రువ పత్రాలు, దరఖాస్తులు పరిశీలించి బ్యాంకులకు అందజేశాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తే బ్యాంకు అధికారులు వారి నిబంధనల ప్రకారం ఎంపికైన లబ్ధిదారులకు రుణాలు ఇవ్వనున్నారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది.

– విజయలక్ష్మి,
ఎస్సీ కార్పొరేషన్ ఈడీ,మెదక్

ఇందిర మహిళ శక్తితో చేయూత

స్త్రీనిధి బ్యాంకు రీజియన్ మేనేజర్ గంగారాం



మాట్లాడుతున్న స్త్రీనిధి ఆర్‌ఎం గంగారాం

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామీణ మహిళలకు ఆర్థిక చేయుతనిచ్చేందుకు ప్రభుత్వం ఇందిర మహిళ శక్తి పథకం ద్వారా సహకారం అందిస్తుందని స్త్రీనిధి బ్యాంకు రీజియన్ మేనేజర్ గంగారామ్ అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన ఇందిర మహిళశక్తి సంబరాలు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. మహిళలు ఆర్థికంగా బలపడేందుకు ఇందిర మహిళ శక్తి పథకం ఎంతో దోహదపడుతుందన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే మహిళ శక్తి సంబరాలలో మహిళలకు పలు అంశాలపై ఆవగాహన కల్పించనున్నట్లు తలెపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీలు యశోద, రాజు, నాగరాజు,, కిషన్, మహిళ సమైక్యా ప్రతినిధులు పాల్గొన్నారు.

నార్సింగిలో..

నార్సింగి మండల కేంద్రంలో మహిళ సమైక్యా ఆధ్వర్యంలో ఇందిర మహిళ శక్తి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఓ ఆశోక్, సీసీలు శంకర్, సుల్తాన, మహిళ సమైక్యా ప్రతినిధులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన మహిళా నేతలు



మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందచేస్తున్న సునీతారెడ్డి, బీఆర్‌ఎస్ మహిళా నేతలు

నర్సాపూర్: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పార్టీకి చెందిన పలువురు మహిళ నేతలు కలిశారు. మాజీమంత్రి సబితారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి, ఎమ్మెల్సీ వాణి తదితరులు హైదరాబాద్‌లోని కేసీఆర్ నివాసానికి ఆయనను పరామర్శించారు. ఈ మేరకు ఎమ్మెల్యే సునీతారెడ్డి మీడియాకు వెల్లడించారు. కేసీఆర్ అస్వస్థతకు గురైనప్పుడు తాను అందుబాటులో లేకపోవడంతో పరామర్శించేందుకు వెళ్లలేకపోయామని తెలిపారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

వైభవంగా రుక్మిణీవిఠలేశ్వర కల్యాణం

హాజరైన ఎంపీ సురేశ్‌షెట్కార్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



కల్యాణంలో పాల్గొన్న ఎంపీ సురేశ్‌షెట్కార్

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలోని రుక్మిణీవిఠలేశ్వర కల్యాణ మహోత్సవం మంగళవారంఅంగరంగ వైభవంగా జరిగింది. ఆషాఢశుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని ఆలయంలో మూడు రోజులుగా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి



చిట్కుల్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ ఏఈ అరుణ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు తప్పనిసరిగా నిర్మాణాలు చేపట్టాలని హౌసింగ్ ఏఈ అరుణ్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని చిట్కుల్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 22 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయగా, 18 మంది ఇంటి నిర్మాణాలను ప్రారంభించారన్నారు. బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన రెండి నిర్మాణాల కొలతలు తీసుకుని, వాటి ఫొటోలు ఆప్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. త్వరలోనే వారికి మొదటి విడత డబ్బులు జమ అవుతాయన్నారు. మిగతా వారు సైతం ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

ఏకాగ్రతతో ఏదైనా సాధించొచ్చు

సీఐ రేణుకారెడ్డి



జ్ఞాపికలు అందజేస్తున్న సీఐ రేణుకారెడ్డి

అల్లాదుర్గం(మెదక్): పట్టుదల , ఏకాగ్రతతో ఎంత పెద్ద లక్ష్యమైన సాధించవచ్చని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి అన్నారు. అల్లాదుర్గం జూనియర్ కళాశాల , జెడ్పీ బాలుర పాఠశాలలో ఉత్తమ ఫలితాలు పొందిన విద్యార్థులకు ఇంపాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో సన్మానించి, పోత్సాకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు వంద శాతం సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని, ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు సాధిస్తారని తెలిపారు. లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలన్నారు. క్రమ శిక్షణనే విద్యార్థిని లక్ష్యానికి చేరుస్తుందని ఇంపాక్ట్ సంగారెడ్డి జిల్లా రీజనల్ అధ్యక్షుడు రాజేశ్వర్ అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ధనుంజయ్య, ఇంపాక్ట్ కార్యదర్శి నర్సింహరెడ్డి, కోఆర్డినేటర్ రమేశ్ , కళాశాల ప్రిన్స్‌పాల్ తుకారం పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపించాలి

ఎంఈఓ బాలరాజు



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ బాలరాజు

కౌడిపల్లి(నర్సాపూర్): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజు క్రమం తప్పకుండా బడికి పంపించాలని ఎంఈఓ బాలరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని కొత్తచెరువుతండా పాఠశాలను తనిఖీ చేసి టీచర్లు, పేరెంట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 25 మంది విద్యార్థుల కుగాను కేవలం 11మంది మాత్రమే హాజరు కావడంతో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి రోజు తప్పనిసరిగా విద్యార్థులకు పాఠశాలకు పంపించాలని చెప్పారు. పిల్లలను సెల్‌ఫోన్, టీవీకు దూరంగా ఉంచాలన్నారు. ఇంటి వద్ద చదివించాలన్నారు. విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. సమస్యలుంటే అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తేజశ్రీ, అరుణ, తండావాసులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

ఐకేపీ మండల సమాఖ్య అధ్యక్షురాలు పుణ్యమ్మ



మాట్లాడుతున్న పుణ్యమ్మ

కౌడిపల్లి(నర్సాపూర్): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అందులో భాగంగానే అర్హులైన ప్రతి డ్వాక్రా సంఘానికి రుణాలు ఇస్తుందని ఐకేపీ మండల సమాఖ్య అధ్యక్షురాలు పుణ్యమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఇందిర మహిళ శక్తి సంబరాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 694 డ్వాక్రా సంఘాలు ఉండగా 7,250 మంది సభ్యులు ఉన్నట్లు చెప్పారు. ఈ ఏడాది బ్యాంక్ ద్వారా రూ 29.83కోట్లు రుణాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ 7.70 కోట్లు, స్త్రీనిధి ద్వారా రూ 2.03 కోట్లకుగాను రూ.14లక్షలు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం ఏపీఎం సంగమేశ్వర్ మాట్లాడుతూ మహిళ సంఘాలతోపాటు వృద్ధులు, కిషోర బాలికలు, వికలాంగుల సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మహిళ సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తుందన్నారు. ప్రమాదబీమా, రుణబీమా అమలులో ఉంటుందన్నారు. మహిళ సంఘాల సభ్యులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సంగమేశ్వర్, మండల సమాఖ్య కార్యదర్శి రాధిక, కోశాధికారి లత, సీసీలు నాగరాజు, రమేష్, దుర్గయ్య, శ్రీకాంత్, లక్ష్మీ, డీఎంజీ దత్తు, వీఓఏలు పాల్గొన్నారు.

బ్యాంకు ఎదుట రైతుల నిరసన



బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

చిన్నశంకరంపేట(మెదక్): విద్యుత్ అంతరాయం కారణంగా తరచూ బ్యాంకు సేవలు నిలిచిపోతుండడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలం మడూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలోని యూనియన్ బ్యాంకులో రుణాల కోసం, రైతుభరోసా డబ్బులు డ్రా చేసేందుకు వస్తున్న రైతులకు విద్యుత్ సరాఫరా లేదని చెబుతూ బ్యాంకు అధికారులు వెనక్కు పంపుతున్నారు. దీంతో ఆగ్రహించిన రైతులు.. బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి వెంటనే ఆటంకంలేని విద్యుత్ సరాఫరాకు చర్యలు చేపట్టాలని రైతులు కోరారు.

సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త



చిలప్‌చెడ్(నర్సాపూర్): అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ రాములు

చిలప్‌చెడ్(నర్సాపూర్): సైబర్ మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని, వారి మాయమాటలను నమ్మి ఖాతాలో ఉన్న డబ్బులు పోగొట్టుకోకుండా జాగ్రత్తపడాలని ఏఎస్‌ఐ రాములు అన్నారు. మంగళవారం ఆయన, సిబ్బందితో కలసి మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు ఖాతా, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పొద్దన్నారు. మొబైల్ ఫోన్లలో వచ్చే అనవసర లింక్‌లపై క్లిక్ చేసి, ఖాతాలో డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసగాళ్ల వలలో పడి డబ్బులు పోగొట్టుకున్నట్లయితే వెంటనే 1930కి కాల్ చేయాలన్నారు.

అవగాహన కలిగి ఉండాలి

కొల్చారం(నర్సాపూర్): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కొల్చారం పోలీసులు సూచించారు. మంగళవారం మండలంలోని ఎనగండ్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు.. నిన్ను నువ్వు కాపాడుకో అన్న అంశంపై అక్కడ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లలు తమ తల్లిదండ్రులను సైతం సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

లింకులు ఓపెన్ చేయొద్దు

పాపన్నపేట(మెదక్): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ సూచించారు.మంగళవారం ఆయన పాపన్నపేటలో జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ప్రజలు తమ ఫోన్లకు వచ్చే మోసపూరిత లింకులు తెరవ వద్దన్నారు. అపరిచిత వ్యక్తులకు ఫోన్లో వ్యక్తిగత సమాచారం ఇవ్వవద్దని చెప్పారు. మోసపూరిత ఏపికె ఫైళ్ళు,లింకులు ఓపెన్ చేస్తే వ్యక్తిగత సమాచారం నేరస్తుల చేతుల్లోకి వెళ్తుందని హెచ్చరించారు.

అప్రమత్తంగా ఉండాలి

అల్లాదుర్గం(మెదక్): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ గాలయ్య చెప్పారు. మంగళవారం చిల్వెర ఐబీ చౌరస్తాలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పిస్తున్నా ప్రజలు మోసాలకు గురవుతున్నట్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఫోన్‌లు ఇవ్వ వద్దని, ఫోన్ చేసి ఓటీపీ చెప్పామంటే చెప్పవద్దని సూచించారు.

పప్పుదినుసుల సాగుకు ప్రోత్సాహం



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ రాంప్రసాద్

టేక్మాల్ (మెదక్): పప్పు దినుసుల సాగు విస్తీర్ణం పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని పెద్దశంకరం పేట ఏడీఏ రాంప్రసాద్ అన్నారు. అన్నదాతలకు జాతీయ ఆహార భద్రత పథకం కింద ఉచితంగా విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. 22 బస్తాలు కంది, 9 బస్తాలు జొన్నలు పంపిణీ చేశామని చెప్పారు. పంట మార్పిడితో మంచి దిగుబడి వస్తుందని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అంబేడ్కర్ విగ్రహాన్ని యథాస్థానంలో ఉంచాలి

నర్సాపూర్: అంబేడ్కర్ విగ్రహాన్ని యథావిధిగా చౌరస్తాలో ఏర్పాటు చేయాలని దళిత సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవులు పలువురు నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రోడ్డు వెడల్పు చేసినప్పుడు చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించి పిల్లల పార్కులో ఉంచారన్నారు. రోడ్డు పనులు ముగిసినా చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వారి వెంట సంఘాల నాయకులు రాంచందర్, పంబాల భిక్షపతి, అశోక్, శివ, భిక్షపతి, యాదగిరి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను దళిత సంఘాల నాయకులు శాలువాతో సన్మానించారు.

◆ ఈడీలక్స్‌లో గమ్యం యాప్ ఏర్పాటు

మెదక్ మున్సిపాలిటీ: కొత్తగా వచ్చిన ఈ–డీలక్స్ బస్సులో గమ్యం యాప్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డీఎంకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మెదక్ ఆర్టీసీ డిపోలో డీఎం సురేఖ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించి ప్రయాణికుల సమస్యలు తెలుసుకున్నారు. ఉదయం 11 నుండి 12గంటల వరకు గంటపాటు జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి ప్రయాణికులు ఫోన్ ద్వారా సమస్యలు తెలిపారు. సమస్యలను సావధానంగా విని ప్రయాణికులకు డీఎం సమాధానాలు ఇచ్చారు.

◆ అందుబాటులో యూరియా

వెల్దుర్తి(తూప్రాన్): వానాకాలం సీజన్‌లో మండలంలో సుమారు 14 వేల ఎకరాల్లో వరిసాగు చేయనున్నట్లు అంచనా వేసినట్లు మండల వ్యవసాయాధికారిణి ఝాన్సీ పేర్కొన్నారు. మండల కేంద్రం వెల్దుర్తిలోని పీఏసీఎస్ ఎరువుల దుకాణాన్ని మంగళవారం సాయంత్రం ఆమె సందర్శించి రికార్డులు, స్టాక్ వివరాలు వంటి వాటిని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డిమాండ్‌కు అనుగుణంగా 500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా అందులో ఇప్పటివరకు 310 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. అలాగే, నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు.

◆ విద్యుత్ సరఫరా మెరుగుపర్చాలి

నర్సాపూర్: పట్టణంలో విద్యుత్ సరఫరాను మెరుగుపర్చాలని బీజేపీ నాయకులు మంగళవారం స్థానిక ఏడీఈ రాంరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేందర్ నాయకులతో ఏడీఈని కలిసి పట్టణంలో విద్యుత్ సరఫరా సరిగా లేదని, అంతరాయం ఎక్కువగా ఉంటుందని వివరించారు. ఓల్టేజీ హెచ్చుతగ్గులు రావడంతో కరెంటు పరికరాలు కాలిపోతున్నాయన్నారు. తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని బిజిలీపూర్‌లో ఎస్సీలపై దాడిచేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం బిజిలీపూర్‌లో ఇతర కులాలదాడిలో గాయపడిని కుటుంబాలను పరామర్శించారు.

◆ విద్యార్థినికి సన్మానం

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని గుంటుకు భావన బాసర ఐఐఐటీకి అర్హత సాధించింది. దీంతో పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం విద్యార్థిని శాలువాలతో సత్కరించి క్యారీ బ్యాగ్ బహూకరించారు. భవిష్యత్తులో శ్రద్ధగా విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ యాదగిరి, హెచ్‌ఎం సాంబయ్య, ప్రభాకర్, శ్రీనివాస్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

◆ సంచార పశువైద్యశాలలో మందులు కరువు

చిలప్‌చెడ్(నర్సాపూర్): సంచార పశువైద్యశాలల్లోనూ మందులు కరువయ్యాయి. దీంతో పశువుల, జీవాల పెంపకందారులకు తిప్పలు తప్పడం లేదు. మండలంలోని సోమక్కపేట్ పంచాయతీ పరిధి గంగిరెద్దులగూడెంలో లేగదూడ అనారోగ్యానికి గురైతే 1962కు కాల్ చేయడంతో, సంచార పశు వైద్యశాల సిబ్బంది అందుబాటులోకి వచ్చారు. వారు వచ్చినా ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. దూడకు సంబంధించిన వైద్యం కోసం చీటీ రాసిచ్చి తమ వద్ద మందులు లేవని వెళ్లిపోయారు.

◆ స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

మెదక్ కలెక్టరేట్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు.